




## రూ.12 లక్షల నగదు పట్టివేత

**ప్రజాశక్తి -ఉలవపాడు :** మండలంలోని మన్నేటికోట అడ్డరోడ్డు వద్ద జాతీయ రహదారిపై పోలీస్ చెక్ పోస్ట్ వద్ద ఉలవపాడు పోలీసులు బుధవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా 12 లక్షల 23 వేల రూపాయల నగదు పట్టుబడినట్టు ఉలవపాడు ఎస్. ఐ బాజీ రెడ్డి తెలిపారు. ఒంగోలు నుంచి నెల్లూరు వైపు వెళుతున్న ఆర్‌టిసి సూపర్ లగ్జరీ బస్సు తనిఖీ చేయగా కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లాకు చెందిన తిమ్మప్ప అనే వ్యక్తి బ్యాగును పరిశీలించగా అతని వద్ద రూ. 12 లక్షల 23 వేల నగదు లభించిందని, దాన్ని సీజ్ చేసినట్టు ఆయన తెలిపారు.



బస్సులో తనిఖీ చేస్తున్న పోలీసులు

# వైసిపి పింఛన్ల రాజకీయం..!

**-పొలిటికల్ మైలేజ్ కోసం తాపత్రయం**

**-జిల్లా వ్యాపితంగా కొనసాగుతోన్న పంపిణీ**

**-వైసిపిలో చేరుతోన్న వలంటీర్లు**

**-తొలి రోజు 1.66లక్షల మందికి పంపిణీ**

**అధికార వైసిపి పింఛన్ల రాజకీయ స్పీడ్ పెంచింది..పొలిటికల్ మైలేజ్ పెంచుకోడానికి ప్రయత్నాలు చేస్తుంది. జిల్లా వ్యాపితంగా బుధవారం గ్రామ సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. రెండు, మూడు రోజులు కొనసాగనుంది. 5వతేదీ నుంచి సచివాలయం రాలేని లబ్ధిదారులకు ఇంటికి వెళ్లి ఇవ్వడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వైసిపి నేతలు దీనిని నానా హంగామా సృష్టిస్తున్నారు. బుధవారం సాయంత్రం 7 గంటలకు 62 శాతం పింఛన్ల పంపిణీ చేశారు. గురువారం సాయంత్రానికి 85 శాతం వరకు చేస్తామని అదికారులు చెప్పారు. సచివాలయం రాలేనివారికి ఇంటికి వెళ్లి ఇవ్వడానికి సన్నాహాలు చేస్తున్నారు. వలంటీర్లు రాజీనామాలు కొనసాగుతున్నాయి. వైసిపికి మద్దతు ప్రకటిస్తున్నారు. జిల్లా వ్యాపితంగా 3.19 లక్షల మంది పింఛన్ల దారులున్నారు.**

**ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిది**

వైసిపికి పింఛన్ల అంశం ప్రచారాస్త్రంగా మారింది. బుధవారం నుంచి జిల్లా వ్యాపితంగా పింఛన్ల పంపిణీ కొనసాగుతోంది. ఉదయం నుంచే వైసిపి నేతలు జిల్లా వ్యాపితంగా నల్లజెండాలు తెచ్చి, లబ్ధిదారుల చేతికిచ్చి నిరసన తెలుపుతూ , చంద్రబాబునాయుడుపై విమర్శలు గుప్పించారు. 5వతేదీ నుంచి సచివాలయం రాలేని వారికి ఇంటికి వచ్చి పింఛన్లు అందిస్తామని అధికారులు ప్రకటించారు. అయినప్పటికీ నడవలేని వృద్ధులను సచివాలయం తీసుకొచ్చి వివాదం చేశారు. ఉదయం నుంచి పింఛన్ల దారులు సచివాలయం ముందు బారులు తీరారు. ఆర్‌బిఐ నుంచి నగదు బ్యాంకులకు రావడం, అక్కడ నుంచి డ్రా చేసుకురావడంతో మధ్యాహ్నం అయింది. మధ్యాహ్నం నుంచి జిల్లా వ్యాపితంగా పంపిణీ కొనసాగింది. ఉదయం నుంచి వైసిపి నేతలు గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాల్లో నానా హంగామా చేశారు. మళ్లీ జగన్ అధికారంలోకి వస్తేనే పింఛన్లు ఇంటికి వస్తుందని, చంద్రబాబు గెలిస్తే పింఛన్ ఇవ్వరంటూ ప్రచారం చేశారు. కొందరు నడవలేని వృద్ధులు, వికలాంగులను సచివాలయం తీసుకొచ్చారు. నల్ల జెండాలు తీసుకొచ్చి వారికి ఇచ్చి నిరసన తెలిపించేలా చేసినట్లు తెలిసింది. ఎక్కడా పింఛన్‌దారులు



ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో రాజీనామా చేస్తున్న వలంటీర్లు

స్వయంగా ఎలాంటి అందోళనకు గురికాలేదు. నిరసన తెలపలేదు. కేవలం వైసిపి నేతలు మాత్రమే కొద్ది సేపు హంగామా చేసినట్లు తెలిసింది. బుధవారం రాత్రి 9 గంటల వరకు సచివాయాల్లో పింఛన్ల పంపిణీ కొనసాగింది. గురువారం రాత్రికి 90 శాతం పంపిణీ పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. మిలిగిన వారికి ఇంటికి వెళ్లి ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ అంశాన్ని తనకు అనుకూలంగా మార్చుకొనడానికి వైసిపి నేతలు పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నారు.

**తొలి రోజు 1.66 లక్షల మందికి పంపిణీ..!**

తొలిరోజు జిల్లా వ్యాపితంగా 62 శాతం మందికి పింఛన్లు అందజేశారు. బుధవారం ఉదయం నుంచే సచివాలయాల వద్ద పింఛనుదారులున్నప్పటికీ ఆర్‌బిఐ నుంచి బ్యాంక్‌లకు, అక్కడ నుంచి నగదు డ్రా చేసుకురావడానికి మధ్యాహ్నం అయింది. మధ్యాహ్నం నుంచి పంపిణీ చేశారు. జిల్లా వ్యాతంగా 3.19 లక్షల మంది పింఛనుదారులున్నారు. ఒక్క రోజు సాయంత్రం 7 గంటల వరకు 1.66 లక్షల మందికి పంపిణీ చేశారు. మొత్తం రూ.95 కోట్లకు గాను రూ.47 కోట్లు అందజేశారు. రాత్రి 9 గంటల వరకు చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. గురువారం సాయంత్రానికి పూర్తి చేయాలని, మిగిలిన వారికి 5వతేదీ ఇంటికి వెళ్లి చెల్లించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. సజావుగా పంపిణీ జరుగుతుందని అధికారులు తెలిపారు.

**కొనసాగుతోన్న వలంటీర్ల రాజీనామాలు..!**

పింఛన్ల రాజకీయాలు వేడెక్కాయి. జిల్లా వ్యాపితంగా వైసిపి నేతల ఆధ్వర్యంలో వలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలు చేస్తున్నారు. మంగళవారం వైసిపి మహిళానేత మొగళ్ల గౌరీ ఆధ్వర్యంలో రాజీనామాలు చేసి, వైసిపిలో చేరుతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. బుధవారం ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో రామలింగాపురంలోని ఆయన నివాసంలో మూకుమ్మడి రాజీనామాలు చేశారు. 32వ డివిజన్ పరిధిలోని 43 మంది వలంటీర్లు రాజీనామా చేసి, జగన్ ముఖ్యమంత్రి కాగానే పనిచే స్తామని, తిరిగి ఉద్యోగాల్లో చేరుతామని ప్రకటించారు. వలంటీర్లు తాము వైసిపి కార్యకర్తలమే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి రాజీనామా చేసిన వారిని అభినందించారు. ఈ వివాదం ఎటు పోతుందో చూడాలి.



గుడ్లూరులోని ఓ సచివాలయంలో పింఛన్లు తీసుకుంటున్న పింఛన్‌దారులు

# పటిష్టంగా ఎన్నికల కోడ్ అమలు

## 14 వరకు ఓటు నమోదుకు అవకాశం - కలెక్టర్ ఎం హరినారాయణన్

**ప్రజాశక్తి -నెల్లూరు :** ఎన్నికల కోడ్‌ను పటిష్టంగా అమలు చేస్తామని, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఈనెల 14వ తేదీ వరకు ఓటరుగా నమోదు చేసుకునేం దుకు అవకాశం ఉందని, అప్పటివరకు వచ్చిన ఓటరు నమోదు దరఖాస్తులను మాత్రమే పరిగణలోకి తీసుకుం టామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరి నారాయణన్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలిపారు. బుధవారం కలెక్టరేట్లోని ఎస్ ఆర్ శంకరన్ విసి హాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ఈనెల 14 వరకు తమకు అందిన ఫామ్ 6, 6ఎ, 8 దరఖాస్తులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 20,44,815 మంది ఓటర్లు గా నమోదయి ఉన్నారని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో 7971 ఫామ్ 6 దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని, వీటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. మే 13 పోలింగ్ రోజున ఓటరు జాబితాలో చిన్న చిన్న తప్పులు, ఫోటోలు సరిగా లేకపోయినా భారత ఎన్నికల సంఘం సూచించిన పది గుర్తింపు



మాట్లాడుతున్న కలెక్టర్ ఎం హరినారాయణన్

కార్డులో ఏదైనా ఒక గుర్తింపు కార్డు చూపి ఓటు హక్కును వినియోగించుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. రూరల్ పరిధిలోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ కూడా ఈ కళాశాలలోని చేపట్టనున్నట్లు చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులందరూ ఎన్నికల సంఘం నిబంధనలను పూర్తిగా అవగాహన చేసుకోవాలని, జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని అమలు చేసేం దుకు సహకరించాలని కోరారు. వ్యక్తిగత విమ ర్శలతో పాటు కుల,మతాల ప్రస్తావన లేకుండా ప్రచారం చేసుకోవాలని సూచించారు. అన్ని రాజకీయ పార్టీలకు నామినేషన్ పత్రాలను అందజేశామని, వీటిని క్షుణ్ణంగా పరిశీలించి ఎటువంటి తప్పులు, పొరపాట్లు లేకుండా పూర్తిచేయాలని సూచించారు. భారీ ర్యాలీలు, సభలు, ప్రచారాలకు ముందస్తుగానే సంబంధిత ఆర్వో వద్ద అనుమతి తీసుకోవాలని సూచించారు. ప్రచారంలో వినియోగించే వాహనాలకు కూడా అనుమతులు తీసుకోవాలని చెప్పారు. సోషల్ మీడియాలో ప్రచురించే రాజకీయ పార్టీల, అభ్యర్థుల ప్రకటనలకు ఎం సి ఎం సి నుంచి తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. తమ పరిధిలోని అన్ని అనుమతులను కూడా ఎటువంటి జాప్యం లేకుండా సకాలంలో మంజూరు చేస్తున్నట్లు, పార్టీల అభ్యర్థులందరూ కూడా ముందస్తు అనుమతులు తీసుకుని జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి పక్కాగా అమలు చేసేందుకు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు. డిఆర్ఓ లవన్న, సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ సదారావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు వైయస్సార్‌సిపి నుంచి మురళీధర్ రెడ్డి, జి నారాయణ, టిడిపి నుంచి సురేంద్రబాబు, బిజెపి నుంచి శ్రీనివాస్, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## పింఛన్లు పంపిణీ

**ప్రజాశక్తి-గుడ్లూరు :** గుడ్లూరు లో బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక ఒకటో నెంబర్ సచివాల యంలో అధికారులు పంపిణీ చేశారు. 235 మందికి వృద్ధాప్య పింఛన్లు అందజేసినట్లు అధికారులు తెలిపారు.



'పది' మూల్యాంకనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

## పటిష్టంగా 'పది' మూల్యాంకనం

**ప్రజాశక్తి -నెల్లూరు :** పదో తరగతి ప్రశ్న పత్రాల మూల్యాంకనాన్ని ఎటువంటి పొరపాట్లు లేకుండా పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ హరి నారాయణన్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం నెల్లూరు నగరంలోని దర్గామిట్టలో గల జిల్లా పరిషత్ హై స్కూల్లో పదో తరగతి ప్రశ్న పత్రాల మూల్యాంకనాన్ని కలెక్టర్ పరిశీలించారు. జిల్లా విద్యాశాఖ అధికారి పివిజె రామారావు స్పాట్ వాల్యుయేషన్ వివరాలను కలెక్టర్ కు వివరించారు. ఈ నెల ఒకటి నుంచి వాల్యుయేషన్ ప్రక్రియ ప్రారంభమైందని, సుమారు 1700 మంది ఉపాధ్యాయులు ప్రశ్న పత్రాల మూల్యాంకనంలో విధులు నిర్వహిస్తున్నారని డీఈవో చెప్పారు. ఈనెల 8వ తేదీ వరకు ఈ ప్రక్రియ జరుగుతుందని, ఉపాధ్యాయులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, భోజనం అందజేస్తున్నామన్నారు. కలెక్టర్ వెంట డిప్యూటీ డిఈవోలు రఘురాం, ప్రసన్న లక్ష్మి, అసిస్టెంట్ కమిషనర్ ఖాన్ ఉన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఇంటూరి నాగేశ్వరరావు

## ఎంఆర్‌పిఎస్ మద్దతు

**ప్రజాశక్తి -కందుకూరు :** కందుకూరులోని టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ టిడిపి కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావును ఎంఆర్‌పియస్ నాయకులు కలిసి మద్దతు తెలిపారు. అనంతరం మీడియా సమావేశం లో పాల్గొన్న ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎంఆర్‌పియస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగకు కృతజ్ఞతలు తెలిపారు. మాస్కులు లేవని అడిగినందుకు డాక్టర్ సుధాకర్ ను మానసిక రోగిగా ముద్ర వేసి ప్రాణాలు తీసిన చరిత్ర జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానిదన్నారు. ఐదేళ్ల వైసిపి పాలనలో లెక్కలేనంతమంది దళితులపై దాడులు, అత్యాచారాలు, హత్యలు జరిగాయన్నారు. మాదిగలకు న్యాయం చేయగలిగేది ఒక తెలుగుదేశం పార్టీ మాత్రమేనన్నారు. పార్టీకి అండగా నిలవాలన్నారు. ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు జలదంకి నరసింగరావు మాదిగ, ఎంఎస్ పి రాష్ట్ర నాయకులు వర్ల దేవదాసు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు నేలపాటి రాజు మాదిగ, ఎంఎస్పి నాయకులు రావినూతల ముత్తు మాదిగ, ఎమ్మార్పీఎస్ ఉలవపాడు మండల అధ్యక్షులు రావినూతల ఐజాక్ మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు పున్నేపల్లి శ్రీనివాసులు, జంగిలి లెనిన్ మాదిగ, గౌడపేరు బాలు, చేవూరు శ్రీను, చదలవాడ శ్రీనాథ్, బాబురావు తోపాటు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి చదలవాడ కొండయ్య, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే ఉన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఇంటూరి సౌజన్య

## ఇంటింటి ప్రచారం

**ప్రజాశక్తి-కందుకూరు :**కందుకూరు పట్టణంలోని ఎల్ఐసి ఆఫీస్ ఎదురు ప్రాంతంలో, పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో కందుకూరు నియోజకవర్గ టిడిపి కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య ఇంటింటి ప్రచారం చేశారు. ఎంయల్ఎ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు ,ఎంపి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. వార్డు అధ్యక్షుడు అత్తంటి శివకృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శి ముచ్చు శ్రీను, పట్టణ మహిళా కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముచ్చు లక్ష్మీరాజ్యం, కల్లూరి శైలజ, వార్డు నాయకులు నల్లబోతుల మురళి, జమ్ము చైతన్య లక్ష్మీనారాయణ, ఎలికా మహేష్, అత్తింటి శ్రీలక్ష్మి మరియు పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు సవిడిబోయిన వెంకటకృష్ణ, వార్డు అధ్యక్షులు గుమ్మా శివ ఉన్నారు.

## పింఛన్ల పంపిణీలో రాజకీయం సరికాదు

**ప్రజాశక్తి-కందుకూరు :** పింఛన్ల వ్యవహారంలో రాజకీయ వికృత క్రీడకు సాక్షాతూ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి తెరలేపడం సిగ్గుచేటని, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్ పేర్కొన్నారు. కందుకూరు పట్టణంలో పలు సచివాలయాల దగ్గం వృద్ధులను కలిసి తరువాత ప్రసాద్‌మాట్లాడారు. పరిపాలన చేతగాని ముఖ్యమంత్రి ప్రతి విషయాన్ని రాజకీయం చేసి తన తప్పును ప్రతిపక్షాలపై రుద్దటం అలవాటైందని విమర్శించారు.తెలుగుదేశం గెలిస్తే మొదటి నెలనే 4 వేల రూపాయల పెన్షన్ ను ఇంటి వద్దనే ఇచ్చే విధంగా తగిన విధానం పార్టీ రూపొందిస్తుందనీ తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్ తెలిపారు.

# సిపిఎం ఇంటింటి ప్రచారం

**ప్రజాశక్తి -నెల్లూరు :** నగర నియోజకవర్గం 54 వ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వ రపురం ప్రాంతంలో సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న సిపిఎం జిల్లాకార్యదర్శి మూలం రమేష్ మాట్లాడు తూ ఇప్పటి వరకు పాలకుల ని ర్లక్ష్యం వల్లే నగర నియోజకవ ర్గ పరిధిలోని 53 ,54 డివిజన్లు వెనకబడ్డాయన్నారు. 50 వేల మందికి పైగా జనాభా కలిగిన ప్రాంతంలో ప్రభుత్వ బ్యాంకు లేకపోవడం విచారకరమన్నారు. ఈ ప్రాంతంలో ప్రభుత్వ బ్యాంకు ఏర్పాటు చేసేవరకు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో స్థాని కుల సహకారంతో పోరాటం చేస్తామన్నారు.అవకాశవాద రాజకీయాలు చేస్తూ బెలూన్ల మాదిరిగా అపోహలతో గాల్లో తేలుతున్న నాయకులకు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు.కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీ మత విద్వేషాలను రెచ్చగొట్టి తిరిగి అధికారంలోకి వచ్చే ప్రయత్నం చేస్తుందన్నారు. అటువంటి పార్టీకి మద్దతు ఇస్తున్న టిడిపి వైసిపి జనసేన పార్టీలకు ప్రజలు ఓటు అనే ఆయుధంతో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడే సిపిఎం ను ప్రజలు ఆదరిం ఆదరించాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, జి నాగేశ్వరరావు, ఐద్వా సంఘం నాయకురాలు కత్తి పద్మ,ఆ డివిజన్ శాఖ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు, సిపిఎం సిఐటియు కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

# టిడిపిలో పలువురు చేరిక

**ప్రజాశక్తి-కందుకూరు :** గుడ్లూరు మండలం దారకానిపాడులో టిడిపిలో పలువురు చేరారు. కందుకూరు నియోజకవర్గ టిడిపి కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుకి మద్దతు ప్రకటిస్తూ ఎస్‌సి కాలనీ వాసులు పెద్ద ఎత్తున పార్టీలో చేరారు. కొత్తగా పార్టీలో చేరిన వారికి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని, రాబోయే ప్రభుత్వంలో తగిన ప్రాధాన్యత ఉంటుందని నాగేశ్వరరావు తెలిపారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు కాకుమని కోటేశ్వరరావు, పార్టీ నాయకులు సోమినేని హరినాథ్, సింగిల్ విండో సొసైటీ మాజీ అధ్యక్షులు కాకుమని వెంకటేశ్వర్లు, అల్లం మస్తా నయ్య, ఘట్టమనేని మల్లికార్జున, సోమినేని సుధాకర్, కాకుమాని వెంకటేశ్వర్లు, మూలగిరి మోహన్ రావు, గడ్డం అంకయ్య, కాకుమాని రామయ్య, కాకుమాని వెంకటేశ్వర్లు, రూపినేని శ్రీహరి, కుర్రా కోటేశ్వరరావు, కాకుమాని హరిబాబు, తన్నీరు మాల్యాద్రి, బెల్లంకొండ వెంకటేశ్వర్లు ఉన్నారు.

**ఆర్యవైశ్యుల మద్దతు**

కందుకూరు నియోజకవర్గ టిడిపి కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు కు కందుకూరు పట్టణ ఆర్యవైశ్యులు మద్దతు పలికాయి ఉమ్మడి ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘ ప్రధాన కార్యదర్శి తాతా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పలు వార్డులకు చెందిన ఆర్యవైశ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో పార్టీలో చేరారు. తాతా లక్ష్మీనారాయణ, తాతా సీతారామాంజనేయులు అండ్ బ్రదర్స్, పద్మనాభుని వర్క్ండేయులు, కందుకూరు క్లాత్ మర్చంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తాతామోహన్ రావు అండ్ సన్స్, కందుకూరు మండలం ఆర్యవైశ్య సంఘ కార్యదర్శి కోట నరసింహం, తుమ్మపూడి సుబ్బయ్య, గుర్రం మహేష్, కారంశెట్టి వెంకన్న, బొమ్మిశెట్టి కోటేశ్వరరావు అండ్ బ్రదర్స్, గుర్రం హరిబాబు గుర్రం చిన్న అల్లూరయ్య, కొత్త శ్రీనివాసరావు ఇంకా పలు కుటుంబాలు నాగేశ్వరావుకి మద్దతు ప్రకటించాయి. కందుకూరు పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, పట్టణ టిడిపి ఆర్యవైశ్యులు పాల్గొన్నారు. అంతకుముందు గాంధీజీ విగ్రహానికి నాగేశ్వరావు పూలమాలవేసి నివాళులర్పించారు.



ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టిడిపిలో చేరుతున్న దారకానిపాడువాసులు



బుర్రాను సత్కరిస్తున్న జెడ్‌పిటిసి ఇంటూరి భారతి, తదితరులు

## ఎంఎల్ఎ 'బుర్రా'కు సన్మానం

**ప్రజాశక్తి -వలేటివారిపాలెం :**జెడ్‌పిటిసి ఇంటూరి భారతి ఆమె భర్త వైసీపీ సీనియర్ నాయకులు ఇంటూరి హరిబాబును కందుకూరు నియోజకవర్గం వైసిపి అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ కలిశారు బుధవారం మండలంలోని బడేవారిపాలెం గ్రామంలోని భారతి నివాసానికి బుర్రా మధుసూదన్ యాదవ్ వచ్చారు ఆయనకు ఇంటూరి భారతి హరిబాబు దంపతులు స్వాగతం పలికారు. రానున్న ఎన్నికల్లో తనకు మద్దతు తెలపాలని కోరారు. మండల పరిషత్ అధ్యక్షురాలు పోనుగోటి మౌనిక కూడా ఇంటూరి హరిబాబు నివాసంలో ఎంఎల్ఎను కలిశారు. వైసిపి మండల అధ్యక్షులు పరిటాల వీరస్వామి, వైసిపి సీనియర్ నాయకులు కట్టా హనుమంతరావు, ఎంపిటిసి చౌడబోయిన యానాది, టెంకం కొండలరావు చింతలపూడి రవీంద్ర ఇరపాని అంజయ్య అమ్మపాలెం సర్పంచ్ ఓబుల కొండయ్య కుమ్మరి మాల్యాద్రి సుండి సర్పంచ్ వీరప్పన్ సతీష్ అయ్యవారిపల్లి సర్పంచ్ డేగ వెంకటేశ్వర్లు హెూటల్ కిష్టయ్య యాల హరి బ్రహ్మారెడ్డి గుప్తా గోపి గురల కిష్టయ్య కి అనుములు లక్ష్మి నరసింహ నల్లమోతు చంద్రమౌళి ఉన్నారు..

# ఎంఎల్ఏను కలిసిన వైసిపి నాయకులు

**ప్రజాశక్తి-కందుకూరు :** కందుకూరు వైసిపి కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా ఎంఎల్ఎ బుర్రా మధుసూదన్ యాదవ్‌ను మండలంలోని పలువురు ప్రజా ప్రతినిధులు కలిశారు. ఈ సందర్భంగా బుర్రా మధుసూదన్ యాదవ్ నాయకులతో మాట్లాడుతూ పెద్దలు మానుగుంట మహీధర్‌రెడ్డి కుటుంబాన్ని ఆదరించినట్లుగానే తనను ఆదరించాలని కోరారు. ఎంఎల్ఏను కలిసినవారిలో మాజీ ఎఎంసి చైర్మన్ తోకల కొండయ్య, పార్టీ అధ్యక్షులు గంగవరపు వెంకటరావు, జె సి ఎస్ కోఆర్డినేటర్ చీమల వెంకటరాజా జడ్పిటిసి ప్రతినిధి ఎ.శ్రీనివాసులు, ఎంపీపీ ప్రతినిధి ఇంటూరి మాధవరావు, సర్పంచులు వీరమల్లు శీను, సర్పంచ్ ప్రతినిధి కూనం సింగారెడ్డి, ఎక్స్ సర్పంచ్ ఎనమద్రి సుబ్బారావు, మాజీ సర్పంచ్ నాగేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకారెడ్డి, వైఎస్ఆర్సిపి మండల నాయకులు కూనం రామకష్ణారెడ్డి, ఈదర రమేషు, గుళ్లా రోశయ్య , వెంకటేశ్వర రెడ్డి,ప్రభాకర్ రెడ్డి, అత్తంటి వసంతరావు, ఎ నాగేశ్వరరావు ఉన్నారు.




బుర్రాను కలిసిన ప్రజా ప్రతినిధులు



విద్యార్థిని అభినందిస్తున్నదృశ్యం

## విద్యార్థినికి అభినందనలు

**ప్రజాశక్తి-నెల్లూరు :**కొండాయపాళెం లోని నగర పాలక ప్రాథమిక పాఠశాల లో విద్యనభ్యసిస్తున్న మసనం అజయ్ బాబు జవహర్ నవోదయ - 2024 ఫలితాల్లో సీటు సాధించి తన ప్రతిభను చాటాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యం భాస్కర్ రావు అజయ్ బాబును పూలమొక్క ఇచ్చి అభినందిస్తూ మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డుకాదని నిరూపించాడు. మా పాఠశాలలోని విద్యార్థులకు వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధం చేస్తామని ఆయన చెప్పారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హరీష్,రాశి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థినికి ఎంఇఒ అభినందనలు

**ప్రజాశక్తి-ఉదయగిరి**



నవోదయ ప్రవేశ పరీక్ష అర్హత సాధించిన విద్యార్థిని రావూరి ప్రణీతను ఎంఇఒ-2 తోట శ్రీనివాసులు అభినందించారు. బుధవారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల స్థానిక బిసి తెలుగులో 5వ తరగతి చదువుతున్న రావూరి ప్రణీత 2024-25 నవోదయ ప్రవేశ పరీక్షలో సీటు సాధించిన సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఎంఇఒ విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థిని ప్రణీతను అభినందించారు, విద్యార్థుల కుటుంబాలలో పేదరికం పోవాలంటే చదువు ఒక్కటే మార్గమని ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, కృషి, పట్టుదల ఫలితం ఈ నాలుగు సోపానాలను పాటిస్తూ పోతే విజయం తప్పక సాధిస్తారని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు జి.నాగయ్య సారథ్యంలో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేకంగా నవోదయ శిక్షణ తరగతులు నిర్వహించిన పాఠశాల ఉపాధ్యాయులైన షేక్ ఎస్థాని, హకీమ్ గౌస్ బాషా, షేక్ మొహమ్మద్, బి సారథి గారలను ప్రత్యేకంగా అభినందించారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని ప్రతిభ

**ప్రజాశక్తి-మర్రిపాడు**



మండలంలోని తిక్కవరం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థిని చంద్ర నందన 6వతరగతి నవోదయ ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచి జవహర్ నవోదయ విద్యాలయంలో సీటు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచి నవోదయకు ఎంపికైన విద్యార్థినిని పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

## నేటి నుంచి ప్రచారం



**ప్రజాశక్తి-సీతారామపురం**

మండలంలోని చిన్నగానపల్లి గ్రామంలో గురువారం నుండి 'పల్లెపల్లెకు కాకర్ల' కార్యక్రమం ప్రారంభమవుతుందని బుధవారం మండల టిడిపి కన్వీనర్ కప్పు ప్రభాకర్ రాజు తెలిపారు. గురువారం నుండి కూటమి ఎంఎల్ఎ అభ్యర్థి కాకర్ల సురేష్ ప్రారంభిస్తున్న పల్లెపల్లెకు కాకర్ల కార్యక్రమంలో మండలంలోని టిడిపి నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కాకర్ల సురేష్ ఇంటింటికీ తిరిగి ప్రజల నుండి సమస్యలను అడిగి తెలుసుకుంటారన్నారు. ఉదయగిరి ఎంఎల్ఎగా ఆదరించాలని కాకర్ల సురేష్ ప్రజల ఆశీర్వాదం కోరుకుంటున్నారు.

## సంక్షేమంపై ప్రజలందరూ సంతృప్తి

**ప్రజాశక్తి-కావలి**



సిఎం జగన్మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలపై ప్రజలందరిలో సంతృప్తి వ్యక్తమవుతుందని ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం కావలి పట్టణంలోని 26వ వార్డులో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని సందర్శించారు. అలాగే ఇంటింటికీ తిరిగి గత ఐదేళ్ల కాలంలో ప్రజలకు అందిన సంక్షేమ ఫలాలు అభివృద్ధి పనుల వివరాలతో కూడిన పత్రికలను పంచుతూ రానున్న ఎన్నికల్లో తనకు మరో అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఒక మహిళ ప్రభుత్వ కార్యక్రమాలు జగనన్న నవ్వుకున్న స్పష్టంగా వివరించి తన మాటలతో అందరినీ ఖుషీ అనిపించుకోవడం విశేషం. అనంతరం ఎంఎల్ఎ మాట్లాడుతూ పేదల పొట్టకొట్టే కుట్రల టిడిపి కూటమి ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు సామాన్యులంతా సిద్ధంగా ఉన్నారన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ నగళ్ళ శ్రీనివాస కిరణ్, స్థానిక నాయకులు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, వేమిరెడ్డి విజయ కుమార్ రెడ్డి, జనిగర్ల మహేంద్ర, తదితరులున్నారు.

## వైసిపిలో పలువురు చేరిక

**ప్రజాశక్తి-కావలి**



ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో కావలి నియోజకవర్గం మన్నంగిదిన్నె పంచాయతీ కొండాయగారిపాలెం గ్రామానికి చెందిన 100మంది టిడిపి కార్యకర్తలు బుధవారం టిడిపి పార్టీని వీడి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మన్నంగిదిన్నె సర్పంచ్ చలంచర్ల ప్రభాకర్ రెడ్డిఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఉప్పల కిరణ్, మన్నెం వెంకటకృష్ణ, వినోద్, వెంకట్రావు, మాల్యాద్రి, ఉప్పాల రమేష్, తిరుపతి, భార్గవ్, గణేష్, మోర్ల శివ, కృష్ణ, నాశిన, ప్రకాష్, రమేష్, రమణయ్య, నాశిన రాములు పలువురు కార్యకర్తలు బుధవారం టిడిపికి గుడ్ బై చెప్పి, కావలి ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి సతీమణి ఆదిలక్ష్మి సమక్షంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తామంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వైసిపిలో చేరేందుకు వచ్చామన్నారు. కార్యక్రమంలో శ్రీశైలం బోర్డు మెంబర్ కేతిరెడ్డి జగదీశ్వర్ రెడ్డి, ఎఎంసి మాజీ డైరెక్టర్ కాటా శ్రీనివాసులు రెడ్డి, చలంచర్ల వినయ్‌రెడ్డి, యానాది రెడ్డి, గోవిందరెడ్డి, మాజీ జెడ్‌పిటిసి కందుల శ్రీనివాసులు, జెసిఎస్ కన్వీనర్ నాగనగారి శ్రీనివాసులు, అమరావేదగిరి సుబ్బరాయుడు గుప్త తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాశక్తి-ఉదయగిరి** : దుత్తలూరు మండలం రాచవారిపల్లి సర్పంచ్ నంబూరి రోశిరెడ్డి, నక్క మల్లికార్జున ఆధ్వర్యంలో బుధవారం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు పలిచెట్టి రమణయ్య, ముత్తం నాగేశ్వర రావు ఆధ్వర్యంలో వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డి సమక్షంలో వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మేకపాటి పార్టీలో చేరిన వారికీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించి చేరిన వారికి తగిన ప్రాధన్యత కల్పిస్తామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నివర్గాల ప్రజలకు పార్టీలకు అతీతంగా అందించిన సంక్షేమ పథకాలే నియోజకవర్గంలో టిడిపిలోని ప్రతి కార్యకర్తను ఆకర్షితులను చేస్తుందన్నారు. ప్రతి గ్రామంలో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. దాంతో దుత్తలూరు మండలంలో టిడిపికి భారీ షాక్ రోజు రోజుకి టిడిపి నుండి వైసిపిలోకి పెరుగుతున్న వలసల పర్వం అధికమవుతుందని తెలిపారు. నియోజకవర్గంలో కూడా ఇదే పరిస్థితి ప్రతి గ్రామంలో నుండి ఎదురవుతుందన్నారు. దుత్తలూరు మండల అధ్యక్షులు దొంతిరెడ్డి వాసుదేవ రెడ్డి, నాయకులు నంబూరి వెసుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి, రమణారెడ్డి, నక్కా మల్లికార్జున, బడే మాల్యాద్రిరెడ్డి, పాల్గొన్నారు.




## ముస్లిముల అభివృద్ధికి కృషి

**ప్రజాశక్తి-కావలి**

ముస్లిము లకు ఎలాంటి అభివృద్ధి జరిగినా, సంక్షేమ పథకాలు అందినా అది తెలుగుదేశం ప్రభుత్వంలో మాత్రమే అని ముస్లిం నాయకులు తెలిపారు. బుధవారం కావలి టిడిపి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి ముస్లిముల ద్రోహి అని, ముస్లిములకు ఉన్న అన్ని పథకాలను దూరం చేశారని, ముస్లిముల సంక్షేమానికి ఎలాంటి కృషి చేయలేదని తెలిపారు. ముస్లిములకు పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అందించిన, ముస్లిముల అభివృద్ధికి కృషి చేసిన తెలుగుదేశం పార్టీని అధికారంలోకి రావడం కోసం తమవంతు కృషి చేస్తామన్నారు. దుల్హన్ పథకం, రంజాన్ తోఫా వంటి అనేక పథకాలను ముస్లిములకు దూరం చేశారని మండిపడ్డారు. కావలిలో ఎంఎల్ఎ అభ్యర్థిగా ఉన్న కావ్య క్రిష్ణారెడ్డి, ఎంపి అభ్యర్థిగా ఉన్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ప్రతి ముస్లిం ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కావలి పట్టణ మైనారిటీ అధ్యక్షులు రహీం, మైనార్టీ ప్రధాన కార్యదర్శి హఫీజ్, రాష్ట్ర మైనార్టీ సెల్ సెక్రటరీ మస్తాన్, ఖాదర్ బాషా, ఇట్టు, జిల్లా మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు రఫీ, కమార్ బాబు హజరత్ ఇబ్రహీం హుస్సేన్ ఆన్సర్ గౌస్ షబ్బీర్, మన్సూర్, యస్థాని అజ్మల్, నాయబ్, ఇమ్రాన్, అల్తాఫ్, ఆసిఫ్, సాజిద్, రసూల్, జిలాని, తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయ వ్యవస్థతో సంస్కరణలు

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**

రాష్ట్రంలో గ్రామాలలో సచివాలయ వ్యవస్థ ద్వారా విద్య, వైద్యం, వ్యవసాయాలలో ఎన్నో సంస్కరణలు చేపట్టామని, రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాల పాలనలో జగన్‌మోహన్ రెడ్డి అందజేసిన సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తున్నామని, ప్రతి ఇంట్లో తమకు ప్రజల నుండి లభిస్తున్న ఆదరణతో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రావడం తథ్యమని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి అన్నారు. బుధవారం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 4వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలను అందచేసి వచ్చే ఎన్నికల్లో గెలిపించాలంటూ అభ్యర్థించారు. ఎంఎల్ఎ మేకపాటి ప్రతి నివాసంలో ప్రజలు సాదర స్వాగతం పలికారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఎంఎల్ఎ మేకపాటి విక్రమరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ఒక్క రూపాయి అవినీతికి తావులేకుండా వలంటీర్ వ్యవస్థ ద్వారా జగనన్న సంక్షేమాన్ని అందజేశామని, ప్రస్తుతం టిడిపి వారు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో వలంటీర్ సేవలు రాష్ట్ర వ్యాప్తంగా నిలిపివేయడం జరిగిందన్నారు. గత ఐదు సంవత్సరాలుగా ప్రజలకు విశేషసేవలు



మాట్లాడుతున్న ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి

అందిస్తున్న వలంటీర్ సేవలు ప్రస్తుతం నిలిపివేయడంతో సామాజిక పింఛన్లు అందుకుంటున్న లబ్ధిదారులు ప్రస్తుతం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పింఛను పొందేందుకు ఎండల్లో తిరిగి 6 వృద్ధులు సైతం మరణించడాన్నారు. వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి ఆలోచన ప్రస్తుతం ప్రజలందరికి తెలిసిందన్నారు. ప్రతిపక్ష పార్టీలు గత ఐదు సంవత్సరాలుగా వలంటీర్ వ్యవస్థపై ఎన్నో ఆరోపణలు చేశారని, మహిళలను మాయం చేస్తున్నారని ఇలా అనేక ఆరోపణలు చేశారని తెలిపారు. ఎన్నికల కోడ్ వచ్చిన అనంతరం వలంటీర్ సేవలు నిలిపివేయడంతో కొంతమంది వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామాలు చేసి ప్రజలకు సేవలు చేస్తామని ముందుకు వస్తున్నారని, అలాంటి వారందరికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్వహిస్తున్న మేమంతా సిద్ధం బస్సు యాత్రకు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోందని, జిల్లాకు కూడా త్వరలోనే బస్సుయాత్ర షెడ్యూల్ కూడా వస్తుందని తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గానికి ఈ దఫా రాకపోయినా ఆత్మకూరు నియోజకవర్గానికి జగనన్న రావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు అందజేశారన్నారు. నేషనల్ స్టాటిస్టిక్స్ బ్యూరో రెండు రోజుల క్రితం వెల్లడించిన వివరాల్లో ఎపి జిడిపిలో 4వ స్థానం, అగ్రికల్చర్ గ్రోత్‌లో 2వ స్థానంలో నిలిచిందన్నారు. ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అనేక స్థానాల్లో నెంబర్ 1 స్థానంలో ముందంజలో నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో జగనన్న అందచేసిన సంక్షేమ అభివృద్ధితో ఆయన కోరుకుంటున్నట్లుగా అన్ని స్థానాల్లో వైసిపి అభ్యర్థులు తప్పక విజయం సాధిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనర్ డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకట రమణమ్మ, వైస్ చైర్మన్ డాక్టర్ శ్రావణ కుమార్, షేక్ సర్దార్, ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి, 5వ వార్డు కౌన్సిలర్ కోటూరు కౌసల్యమ్మ, వి.వి.రమణారెడ్డి, సయ్యద్ ప్రణీత్, నోటి వినయ్‌కుమార్ రెడ్డి, సయ్యద్ జమీర్, తోడేటి మణి, తదితరులున్నారు.

# విద్యతోనే దేశాభివృద్ధి

**ప్రజాశక్తి-ఎఎస్‌పేట**

ప్రతిఒక్కరూ బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించగలరని విద్యతోనే దేశాభివృద్ధి చెందుతుందని హైదరాబాద్ గ్లోబల్ హాస్పిటల్స్ అధినేత రెయిన్‌బో హాస్పిటల్స్ అధినేత డాక్టర్ కంచర్ల రవీంద్రనాథ్, డాక్టర్ కంచర్ల రమేష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం తమ స్వగ్రామమైన ఎఎస్‌పేట మండలంలోని చిరమన గ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలోని దేవంగత కంచర్ల శేషయ్య నాయుడు మెమోరియల్ జెడిపి హైస్కూల్ కంచర్ల సరోజనమ్మ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జెడిపి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పాఠశాలకు కుర్చీలు ఇన్వర్టర్ స్టేజి పునర్నిర్మాణం చేయించాలని కోరడంతో వెంటనే స్పందించిన డాక్టర్ కంచర్ల రవీంద్రనాథ్ పాఠశాలకు అవసరమైన అన్ని వసతులను తమ సొంత నిధులతో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పాఠశాలకు అధిక వసతులను త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వం అందజేస్తున్న మందులతో పాటు ఇంకా అవసరమైన మందులను తమవంతుగా అందజేస్తామని తెలిపారు. ఇప్పటికే గ్లోబల్ హాస్పిటల్స్ రెయిన్‌బో హాస్పిటల్స్ ఆధ్వర్యంలో



సన్మానిస్తున్న దృశ్యం

వైద్య పరికరాలను వివిధ సామగ్రిని హాస్పిటల్ నిర్మాణానికి స్థలాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ మేరకు హాస్పిటల్ ఆవరణంలో సమావేశ గదిని నిర్మించాలని కోరడంతో త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ విద్య వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ జ్యోతిరాణి, డాక్టర్ నాగ వినత, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యంలు శాలువాలు కప్పి పూల మాలలతో సత్కరించారు. అలాగే గ్లోబల్ రెయిన్‌బో హాస్పిటల్ అధినేతలు డాక్టర్ కంచర్ల రవీంద్ర నాథ్ కంచర్ల రమేష్‌లను శాలువాలు కప్పి బొకేలను అందజేశారు. కార్యక్రమంలో కంచర్ల రమాదర్ నాయుడు, ఉప్పుగుండ్ల అంకయ్య చౌదరి, కె.సురేంద్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇంటికెళ్లి పెన్షన్ ఇవ్వాలి

**ప్రజాశక్తి-అనంతసాగరం**

పెన్షన్ పంపిణీ విషయంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పింఛన్‌ను ఇవ్వనున్నారని, టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుపై వైసిపి నాయకులు బురద జల్లడం హాస్యాస్పదంగా ఉందని సోమశిల మాజీ ఎంపిటిసి, టిడిపి సీనియర్ నాయకులు యోగు పెంచలయ్య పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల దగ్గర పడేకొద్దీ జగన్ పెన్షన్‌పై నీచ రాజకీయాలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. వైసిపి చేస్తున్న రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. మే 13వ తేదీ జరిగే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డికి ప్రజలు బుద్ధి చెప్తారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గువ్వల పెంచలయ్య, ముక్కు పుల్లయ్య, పొంగూరు మురళి, ముక్కు నాగరత్నం, అబ్దుల్ రెహమాన్, పోకల శ్రీనివాస్ రెడ్డి, ఉదయగిరి శ్రీకాంత్, చంటి, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌డిఒకు టిడిపి నాయకుల వినతి

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా 1వ తారీఖు అందజేస్తున్న పెన్షన్ విధానాన్ని వలంటీర్ల ద్వారా బదులుగా అధికారులను ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేయాలని ఆత్మకూరు టిడిపి నాయకులు బుధవారం మున్సిపల్ కార్యాలయంలోని ఆర్‌డిఒను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మున్సిపల్ కమిషనర్‌కు, ఎంపిడిఒ, కార్యాలయాలకు వెళ్లి కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ సచివాలయాలకు రాలేని వృద్ధులకు వికలాంగులకు వారి ఇంటి వద్దకే పెన్షన్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, ఆర్‌డిఒను కోరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మకూర్ టౌన్ టిడిపి అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి, ఆత్మకూరు టౌన్ కార్యదర్శి జయకర్, జిల్లా తెలుగు యువత అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, ఆత్మకూరు మున్సిపాలిటీ క్లస్టర్ ఇన్‌ఛార్జి తోడేటి వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

## పింఛన్లు పంపిణీ

**ప్రజాశక్తి-మర్రిపాడు**

మండలంలో సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ మనోహర్‌బాబు తెలిపారు. బుధవారం స్థానిక గ్రామ సచివాలయంలో ఉన్న 357 లబ్ధిదారులకు గ్రామ సచివాలయ సిబ్బంది పంపిణీ చేస్తున్నారన్నారు. మండలంలో ఉన్న 6361 సామాజిక పింఛన్లను 6వ తేదీ వరకు ఇవ్వనున్నట్లు తెలిపారు. వృద్ధులకు, వికలాంగులకు, నడవలేక మంచంలో ఉన్నవారికి పెన్షన్లు ఇంటివద్దకే వచ్చి ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు.



పింఛన్‌ను అందజేస్తున్న అధికారి

**ప్రజాశక్తి-అనంతసాగరం** : మండలంలో బుధవారం నుంచి సచివాలయాల్లో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం మొదలైందని మండల ప్రజాభివృద్ధి అధికారి తాజ్‌మసూర్ పేర్కొన్నారు. 6వ తేదీ లోపు 100శాతం పెన్షన్లు అందజేసి పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. వృద్ధులకు, వికలాంగులకు సచివాలయ సిబ్బంది ఇంటికి వెళ్లి పెన్షన్ అందజేస్తారన్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో సచివాలయాల్లో లబ్ధిదారులకు నీటి సదుపాయం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామన్నారు.

### పెన్షన్ కోసం అవస్థలు..

**ప్రజాశక్తి-అనంతసాగరం** : మండలంలోని అవ్వా తాతలు పెన్షన్ కోసం సచివాలయాలకు వెళ్లి అవస్థలు పడుతున్నారని మండల సచివాలయ కోఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామ సచివాలయ వలంటీర్లు ఇంటి వద్దకే ఒకటో తేదీ పెన్షన్లు ఇచ్చేవారని చంద్రబాబు నాయుడు బృందం చేసిన పనికి పెన్షన్ లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

## ఎన్నికల నిర్వహణపై సమీక్ష

**ప్రజాశక్తి-కావలి**

కావలి 144వ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ వి.కె.శీనానాయక్ బుధవారం ఎన్నికల సమీక్ష సమావేశం డివిజన్‌లోని అధికారులతో ఆర్‌డిఒ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పున:పరిశీలన, వెబ్ కాస్టింగ్ అవసరమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించడం, ఒకే ప్రాంతంలోని 3, అంతకన్నా ఎక్కువ పోలింగ్ కేంద్రాలున్న చోట సి.సి. కెమెరాలు ఏర్పాటు చేయడం, నియోజకవర్గంలో అక్రమమద్యం, నగదు, ఇతర కానుకలపై నిఘా ఏర్పాట్లు, అనే అంశాలపై చర్చించారు. సమావేశంలో నియోజకవర్గంలోని డి.ఎస్.పి., సి.ఐ.లు, ఎస్.ఐ.లు, 4 మండలాల తహశీల్దార్లు, ఎం.పి.డి.ఒ.లు, ఎక్సైజు డిపార్ట్మెంట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఒ శీనానాయక్



## కంద్రిగలో ఎన్నికల ప్రచారం

**ప్రజాశక్తి-బిట్రగుంట**

బోగోలు మండలం ఎస్ వి జి కండ్రిక గ్రామంలో బుధవారం పిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, కావలి నియోజకవర్గం ఇండిపెండెంట్ అభ్యర్థి పసుపులేటి సుధాకర్ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, ఇప్పటికే పదేళ్లుగా గ్రామాల్లో నిస్వార్థంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. కావలి నియోజకవర్గాన్ని స్వతంత్రంగా అభివృద్ధి చేశామని, ప్రతి మండలంలో వీధి దీపాలు ఏర్పాటు చేశామన్నారు. తాగునీరు, కరోనా వంటి సమయంలో ఇంటింటికి నిత్యావసర సరుకులు అందించామని తెలిపారు. అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి పార్టీలు తమ గ్రామాలను పట్టించుకోకపోయిన సమయంలో కూడా కేవలం పిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ తరఫున గ్రామాల్లో పర్యటించి ఎన్నో సేవా కార్యక్రమాలు చేశామని తెలిపారు. కార్యక్రమంలో పిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు పసుపులేటి వెంకటేశ్వర్లు, పసుపులేటి సుధాకర్ యువసేన, గ్రామస్తులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## టిడిపిలో పలువురు చేరికలు

**ప్రజాశక్తి-కావలి**



నవరత్నాల మాటున రాష్ట్రంలో జగన్ ప్రభుత్వంలోని శక్తులు, కావలి నియోజకవర్గంలో ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, ఆయన అనుచరులు అన్ని రకాలుగా ప్రజల సొమ్ము దోపిడీ చేస్తున్నారని, అలాంటి విధ్వంసక పాలకులను తరిమికొడదామని టిడిపి అసెంబ్లీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పిలుపునిచ్చారు. కావలి టిడిపి కార్యాలయంలో బుధవారం జరిగిన చేరికల కార్యక్రమంలో కావలి మండలం ఆనేమడుగు పంచాయతీ, మొండిదిన్నెపాలెం, కట్టకిందపాలెం గ్రామాలకు చెందిన యువత భారీగా కోనంకి కిషోర్ ఆధ్వర్యంలో వైసిపి నుండి టిడిపిలో చేరారు. వీరికి కావ్య క్రిష్ణారెడ్డి టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ ఐదేళ్ల వైసిపి పాలనలో వనరులు దోచుకుని ప్రజలను భయపెట్టి తమ ఆస్తులు పెంచుకున్నారే తప్ప ప్రజలకు ఉపయోగపడే ఒక్క పని చేసిన దాఖలాలు లేవన్నారు. వ్యవస్థలు బాగుపడాలన్న, యువతకు ఉపాధి అవకాశాలు రావాలన్న చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో కావలి రూరల్ మండల అధ్యక్షులు ఆవుల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఉప్పాల వెంకట్రావు, రూరల్ మండల ఎన్నికల ఇన్‌ఛార్జి కండ్లగుంట మధుబాబు నాయుడు, అద్దంకి ప్రభాకర్, ఉప్పాల వెంకటేశ్వర్లు, కోనంకి అశోక్, ఉప్పాల రాము, తదితరులు పాల్గొన్నారు.



## ఇఫ్తార్ విందు

**ప్రజాశక్తి-ఉదయగిరి**

ఉదయగిరి, దుత్తలూరు మండలం నందిపాడు, వెంకటం పేట ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును నియోజకవర్గం వైసిపి అభ్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డి అందజేశారు. బుధవారం రెండు మండలాల్లో ముస్లిం సోదరులు జరుపుకుంటున్న పవిత్రమైన రంజాన్ మాసంలో వారికి ఇఫ్తార్ విందును అందజేయడం సంతోషదాయకమన్నారు. ముందుగా ముస్లిం మత పెద్దలు జరుగుతున్న ప్రత్యేక ప్రార్థనలో ఆయన పాల్గొని ఇఫ్తార్ విందును స్వీకరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి మోడీ రామాంజనేయులు మండల కన్వీనర్ ఓబుల్‌రెడ్డి, ఎంపిపి మూలే పద్మజా వినయ్ రెడ్డి, రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరెక్టర్ అక్కి భాస్కర్ రెడ్డి, వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్ ఎస్థాని, ఎంపిటిసి గొల్లపల్లి తిరుపతయ్య, ఉప సర్పంచ్ మూర్తుజా హుస్సేన్, ఎస్‌సిసెల్ నాయకులు గడ్డం హజరత్తయ్య, ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం పరిశీలన

**ప్రజాశక్తి-అనంతసాగరం** : మండలంలోని పాతాళపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులు నిర్వహించిన ప్రార్థనకు ఎంఇఒ-2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని షూ కొలతల సైజు వివరాలను ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఉప్పలపాడు గ్రామంలోని ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## పొగాకు బేళ్లు కొనుగోలు

**ప్రజాశక్తి-మర్రిపాడు** : మండలంలోని డిసిపల్లి పొగాకు వేలం కేంద్రానికి పలు గ్రామాలకు చెందిన రైతులు 724పొగాకు బేళ్లను వేలం కేంద్రానికి తీసుకురాగా, 603 పొగాకు బేళ్లను పలు కంపెనీలకు చెందిన వ్యాపారస్తులు కొనుగోలు చేశారని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వివిధ కారణాలతో 108పొగాకు బేళ్లను తిరస్కరించారన్నారు. వాటిలో ఎన్ఎస్27ఎన్ బి79 సిఆర్ 02 ఉన్నాయని తెలిపారు. అధిక బరువుతో ఉన్న 13పొగాకు బేళ్లను వేళానికి తిరస్కరించారన్నారు. కిలో పొగాకు గరిష్ట ధర రూ.232కాగా కనిష్ఠ ధర రూ.220 సగటు ధర రూ.228.24నమోదు కాగా, వేలంలో 18మంది కంపెనీ వ్యాపారస్తులు పాల్గొన్నారన్నారు.

## ఎన్నికల ప్రచారం



**ప్రజాశక్తి-ఉదయగిరి**

సమిష్టిగా కృషి చేసి తెలుగుదేశాన్ని గెలిపించాలని టిడిపి నెల్లూరు ఎంపి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో సీతారాంపురం, ఉదయగిరి మండలాల ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ఉదయగిరి, సీతారాంపురం మండలాల కన్వీనర్‌లు బయన్న ప్రభాకర్ రాజు అధ్యక్షతన సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎంతోమంది కలయికతో కూడిన పార్టీలలో విభేదాలు సహజమని వాటిని పక్కన పెట్టి పార్టీ విజయానికి కష్టపడాలన్నారు. పార్టీలు వేరు వ్యక్తిగతం వేరు అని వ్యక్తిగతాన్ని పార్టీకి రుద్దవద్దని తెలిపారు. తిరిగి వైసిపి అధికారంలోకి వస్తే ప్రతి ఒక్కరం బాధ పడాల్సి వస్తుందన్నారు. కనుక కలిసికట్టుగా పనిచేసి తెలుగుదేశాన్ని గెలిపించి నారా చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. నెల్లూరు ఎంపి అభ్యర్థిగా తనను, ఉదయగిరి ఎంఎల్ఎ అభ్యర్థి కాకర్ల సురేష్‌ను ఆశీర్వదించాలని కోరారు. చిన్నచిన్న విభేదాలను పక్కనపెట్టి పార్టీ విజయానికి కష్టపడాలన్నారు. బూత్ కన్వీనర్‌లో కష్టపడి పని చేయాలన్నారు. నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించాలన్నారు. తెలుగుదేశం కార్యకర్తకు ఎలాంటి కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని కచ్చితంగా అత్యధిక మెజార్టీతో గెలవాలని గెలిస్తేనే మెట్ట ప్రాంతమైన ఉదయగిరి బాగుపడుతుందన్నారు. అందుకోసం ప్రతి ఒక్కరూ ఒక సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర భవిష్యత్ బాగుండాలన్న పరిశ్రమలు రావాలన్న యువతకు ఉద్యోగాలు కావాలన్నా రాష్ట్రంలో తెలుగుదేశం అధికారంలోకి రావాలని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వల్లే ఇవన్నీ సాధ్యమని మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి చెంచల బాబు యాదవ్ పేర్కొన్నారు. బుధవారం సీతారాంపురం మండలం చిన్నగంపల్లి నుండి ప్రారంభం ప్రజా సంకల్ప యాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అనంతరం రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి శాంతికుమారి పలువురు నాయకులు గజమాలలుతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర రెడ్డి, మాజీ ఎఎంసి చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి, మాజీ ఎంపిపి చేజర్ల సుబ్బారెడ్డి, మాజీ ఎంపిటిసి కలివెల జ్యోతి, మైనార్టీ నాయకులు రియాజ్, సీతారాంపురం సర్పంచ్ భాగ్యమ్మ, జనసేన రాష్ట్ర కమిటీ నెంబర్ భోగినేని కాశీ రావు, కార్యదర్శి ఆలూరు రవీంద్ర, ఉదయగిరి మండల అధ్యక్షులు కొల్లూరు సురేందర్ రెడ్డి, ఉదయ్, నాయకులు కుర్ర కృష్ణయాదవ్, సీతారాంపురం అధ్యక్షులు తాటిచెట్టి శ్రీనివాసులు, ఉదయగిరి మండల నాయకులు పసుపులేటి తిరుపతయ్య, బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కదిరి రంగారావు, జనసేన జోన్ ఇన్‌ఛార్జి కె.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మర తనిఖీలు

**ప్రజాశక్తి-మర్రిపాడు**

సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా జిల్లా అటవీశాఖ అధికారి ఆవుల చంద్రశేఖర్, ఆత్మకూరు ఎఫ్ఆర్ఒ శేఖర్ ఆదేశాల మేరకు కృష్ణాపురం ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద డిఆర్ఒ రవీంద్రబాబు వాహనాలను ఆపి ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో ఆయనవెంట ఫారెస్ట్ అధికారి ఎన్.తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.







## ఇంటింటి ప్రచారం

**ప్రజాశక్తి-విడవలూరు**

కాబోయే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ప్రజలు ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో ఆశీర్వదించాలని బుధవారం రామతీర్థం గ్రామంలో జరిగిన బహిరంగ సమావేశంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో తన వద్దకు వచ్చి పార్టీలో చేరి ఎన్నికల సమీపిస్తున్న సమయంలో మోసం చేసి వెళ్లిపోయిన వారిని ఏనాటికి నమ్మము అన్నారు. గ్రామాలలో ఎక్కడైనా ఎటువంటి లోటుపాట్లు ఉన్న సరిదిద్దుకుంటామని తెలిపారు. ఊటుకూరు గ్రామం నుండి పొన్న చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆరు గ్రామాల నుండి సుమారు 1000మంది టిడిపికి రాజీనామా చేసి వైసిపి పార్టీ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో పుండ్ల అచ్యుత్ కుమార్ రెడ్డి, కోటంరెడ్డి నవీన్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

**ప్రజాశక్తి-వెంకటాచలం:** ఆటో ఢీకొని దంపతులిద్దరూ గాయపడి సంఘటన వెంకటాచలం లోని ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మనుబోలు మండలం, అక్కంపేట గ్రామానికి చెందిన రమేష్ రెడ్డి దంపతులిద్దరూ మోటర్ బైక్ పై నెల్లూరు నుంచి అక్కంపేటకు వెళ్తుండగా ఆటో వారి బైక్‌ను ఢీకొంది.దీంతో ఈ ప్రమాదంలో దంపతులిద్దరికీ గాయాలయ్యాయి. వీరిద్దరినీ చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## అసత్యాలు తగవు

**ప్రజాశక్తి-ఇందుకూరుపేట:** పేద ప్రజలకు పెన్షన్ అందించడం నారా చంద్రబాబు నాయుడు ఓర్చుకోలేక వలంటీర్లపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఇందుకూరుపేట మండలంలోని నాగరాజుతోపు గ్రామంలో వైసిపి నాయకులతో కలిసి ఇంటింటి ప్రచార కార్యక్రమంలో విజయ్ కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు సుధాకర్, సురేష్, వెంకటేశ్వర్లు, బాబయ్య, సదాశివ రెడ్డి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

### గంగపట్నంలో ప్రచారం

మండలంలోని గంగపట్నం గ్రామంలో వైసిపి నేతలు బుధవారం ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జొన్నవాడ ఆలయ చైర్మన్, వైసిపి మండల అధ్యక్షులు మావులూరు శ్రీనివాసులు రెడ్డి పాల్గొని వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాన్ని ప్రజలకు అందించి వివరించారు. గంగపట్నం గ్రామం అభివృద్ధి చెందాలంటే మళ్లీ ఎంఎల్ఎగా ప్రసన్నకుమార్ రెడ్డిని ఎంపిగా విజయసాయిరెడ్డిని గెలిపించాలని ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో తిరుమలశెట్టి నిరంజన్ నాథ్, ఏలూరు నారాయణ, పంబాల జనార్దన్ రెడ్డి, కేతిరెడ్డి సతీష్ రెడ్డి, వెన్ను ఉమామహేశ్వర్, మహిధర్ రెడ్డి, ఫణింద్ర నాయుడు, షబ్బీర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## పింఛన్లు పంపిణీ

**ప్రజాశక్తి-సంగం:** మండలంలో పింఛన్ల పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నికల కోడ్ దృష్ట్యా ఎన్నికల కమిషన్ వలంటీర్ల ద్వారా కాకుండా సచివాలయం సిబ్బందితో పింఛన్లు పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో సచివాలయం సిబ్బ ంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఒక్కో సచివాలయం పరిధిలో పింఛను తీసు కునే లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్త కుండా ఉండేందుకు మూడు ప్రాంతాలలో కేంద్రా లుగా ఏర్పాటు చేసి పింఛన్లు పంపిణీ చేస్తున్నారు.

## రాష్ట్ర ప్రయోజనాల కోసమే కూటమి

**ప్రజాశక్తి-కావలి**

రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, రాష్ట్రాభివృద్ధి కోసమే టిడిపి, జనసేన, బిజెపిలు కూటమిగా ఏర్పడ్డాయని, ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన నిధులు, జరగాల్సిన అభివృద్ధి కోసమే రాష్ట్రంలో మూడు పార్టీలు జతకట్టాయని, ప్రజల శ్రేయస్సును, వారి భవిష్యత్తుని దృష్టిలో ఉంచుకొనే కూటమి ఏర్పాటు చేసినట్లు ఎంఎల్‌ఎ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి అన్నారు. కావలి టిడిపి కార్యాలయంలో బుధవారం విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొని మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రజలు వ్యవస్థలో మార్పు, విధానాల్లో మార్పుకోరు కుంటున్నా రన్నారు.కార్యక్ర మంలో నాయకులు గుత్తికొండ కిషోర్‌బాబు, బ్రహ్మానందం, పొబ్బా సాయి విఠల్ పాల్గొన్నారు.

# ఆరుతడి పంటలు వేసుకోండి

**ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు**



మాట్లాడుతున్న అధికారులు

సాగు నీటి కొరత నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని రైతులకు ఏడిఎ రాజ్ కుమార్ సూచించారు. బుధవారం మండలం లోని పాపిరెడ్డిపాలెంలో రైతులు సమావేశం జరిగింది. మండల వ్యవ సాయ శాఖ అధికారి వి.వి శిరీష రాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్ర మంలో రాజ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమశిల ప్రాజెక్టులో సాగునీరు కొరత నేపథ్యంలో డెల్టా ప్రాంతాలైన ఇందుకూరు పేట, ముత్తుకూరు, తోటపల్లి గూడూరు మండ లాల్లోని రైతులు రెండో పంట కింద వరికి బదులుగా బోర్ల కింద ఆరుతడి పంటలు వేసుకోవాలని తెలిపారు. ఈ మేరకు మే నెల 15 తర్వాత వేరుశనగ గాని, నువ్వుల పంటలు గాని వేసుకోవచ్చని పే ర్కొన్నారు. జూన్‌లో వేసుకోవాలంటే వేరు శనగ, నువ్వులు, పెసర, మినుము మొదలుగా ఆరుతడి పంటలన్నీ నీటి వసతు ఉన్న పొలాల్లో వేసుకోవచ్చన్నారు. వరిలో ఎకరాకు సరిపడా నీరు 5 నుంచి 7 ఎకరాల వరకు ఆరుతడి పంటలను సాగు చేసుకోవచ్చని తె లిపారు. చౌడు ఉన్న పొలాల్లో వరి పంట ఎండి పోతోందన్నారు. దీనికి కాండం కుళ్లు తెగులు, సల్ఫైడ్ ఇంజురీ మొదలగు సమస్య వలన పండిన పంటలు అక్కడక్కడ ఎండిపోతున్నాయని చెప్పారు. ఇటువంటి పరిస్థితుల్లో రెండవ పంటగా ఆరుతడి పంటలు వేసుకోవడం మంచిదని తెలిపారు. సమావేశంలో విఎఎ షర్మిల, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అవగాహన

**ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు**



మాట్లాడుతున్న మేనేజర్

నానో డిఎపి వాడకం వల్ల రైతులకు బహుళ ప్రయోజనాలు వనగూరుతాయని ఇఫ్కో జిల్లా మేనేజర్ లక్ష్మీ నారాయణ తెలిపారు. మండల ంలోని పాపిరెడ్డిపాలెం, కోవెరపాలెం గ్రామాల్లో రైతులకు నానో డిఎపిపై బుధవారం అవగాహన కార్యక్రమం జరిగింది. మండల వ్యవసాయ శాఖ అధికారి శిరీష రాణి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇఫ్కో జిల్లా మేనేజరు లక్ష్మీనారాయణ్, సహాయ వ్యవసాయ సంచాలకులు రాజ్ కుమార్, మండల వ్యవసాయ అధికారిణి శిరీష రాణి, గ్రామ వ్యవసాయ సహాయకులు షర్మిల తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భం గా వారు మాట్లాడుతూ, గత రబీ సీజన్లో పాపిరెడ్డిపాలెం గ్రామంలో, దాదాపు 20 మంది రైతులు నానో డి.ఎ. పి. ని, వరి పంట పైన వాడటం జరిగిందని తెలిపారు. దాదాపు 240 ఎకరాల్లో ఈ నానో డిఎపిని రైతులు వాడారని తెలియజేశారు. సమావేశంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పెన్షన్‌పై వైసిపి రాజకీయం..

**ప్రజాశక్తి - నెల్లూరు సిటీ**

పెన్షన్ విషయాన్ని...వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తోందని, టిడిపి అధికారంలోకి రాగానే ఇంటింటికి పెన్షన్ పంపిస్తానని మాజీ మంత్రి, నెల్లూరుసిటీ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. బాబుష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా... నెల్లూరు నగరం 45వ డివిజన్‌లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు.అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెన్షన్ విషయాన్ని వైసీపీ రాజకీయం చేస్తోందని ఆరోపించారు. చంద్రబాబు కానీ...తెలుగుదేశం పార్టీ నాయకులు కానీ...1వతేదీ పెన్షన్లు ఇవ్వవద్దని చెప్పలేదన్నారు. ఖచ్చితంగా 1వతేదీనే పింఛన్లు ఇవ్వాలని చెప్పామని... వృద్ధులకి వాళ్ల ఇంటికే వెళ్లి పింఛను ఇవ్వాలన్నారు. ఖజానాలో డబ్బులు లేక...1వతేదీ ఇవ్వలేక...ఓడీ తెచ్చుకో లేక...ప్రతి నెలా ఓడీ తెచ్చు కుంటున్నారని...ఈ నెల రాలేదని...అందుకనే పెన్షన్‌దారులకి పెన్షన్ ఇవ్వలేక పోయా రన్నారు. వలంటీర్లు రాజీనామా చేస్తారన్నది అది వాళ్ల వ్యక్తిగత విషయమని చెప్పారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే... పెన్షన్ దారుడి ఇంటికే తాము కూడా పెన్షన్ పంపిస్తామని హామీ ఇచ్చారు. మేము అధికారంలోకి రాగానే...మీ ఇంటి వద్దకే అధికారుల్ని తీసుకు వచ్చి సమస్యను పరిష్కరిస్తానని ప్రజలకి హామీ ఇచ్చారు. సర్వేపల్లి కాలువ, పెన్నా రివర్ వద్ద ఉన్న కట్టను కొట్టేసిందంతా వైసీపీ వాళ్లేనని ఆరోపించారు. ఇవన్నీ అలా కొట్టేయకూడదని...అందరితో సంప్రదింపులు జరిగిన తరువాతే చేయాలన్నారు.

# 'ఆర్ఎస్ఆర్'లో స్పోర్ట్స్ డే





సన్మానం చేస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి-బిట్రగుంట**

బోగోలు మండలంలోని కడనూతల గ్రామంలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం సాయంత్రం స్పోర్ట్స్ డే ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పివిఎన్ రెడ్డి తెలిపారు. వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జవహర్ భారతి డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మాల్యాద్రి, కోటా సురేందర్ రెడ్డి, కరస్పాండెంట్ శ్రీ వశిష్ట జూనియర్ కాలేజ్ కావలి పాల్గొన్నారని తెలిపారు. అతిథులు మాట్లాడుతూ స్పోర్ట్స్ మరియు గేమ్స్ ప్రతి విద్యార్థిని విద్యార్థులకు ఎంతో అవసరమని తెలుపుతూ రెగ్యులర్‌గా వ్యాయామం చేసే వాళ్లు ఆరోగ్యంగా ఉంటారని, బాడీ ఫిట్నెస్ మంచిగా ఉంటుందన్నారు. జ్ఞాపక శక్తి కూడా ఇంప్రూవ్ అవుతుందని, లీడర్షిప్ క్వాలిటీ డిసిప్లేన్‌గా ఉంటుందని తెలిపారు. తదనంతరం స్పోర్ట్స్ గేమ్స్‌లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ సంవత్సరం ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ఫర్ మెన్ అండ్ ఉమెన్ సిఎస్‌సి డిపార్ట్మెంట్ విద్యార్థిని, విద్యార్థులకు దక్కిందని తెలిపారు. ఆర్ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి విజేతలు అందరికి శుభాకాంక్షలు ఫోన్ల ద్వారా తెలిపారని తెలియజేశారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆర్ వి రమణారెడ్డి, అన్ని విభాగ అధిపతులు, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎ కిరణ్ కుమార్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారని తెలిపారు.

## మధ్యాహ్న భోజనంలో ముగిగిన కోడిగుడ్లు..

**ప్రజాశక్తి-వెంకటాచలం:** స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పథకం కింద పెట్టే కోడిగుడ్లు పాడైపోయాయి.బుధవారం విద్యార్థులకు పెట్టేందుకు 100 కోడిగుడ్లు ఉడకబెట్టారు. ఆ గుడ్లను విద్యార్థులకు పెట్టగా వాటిని కొంతమంది విద్యార్థులు పాఠశాలలో తినకుండా ఇళ్లకు తీసుకెళ్లారు. ఉడకపెట్టిన 100 కోడిగుడ్లలో కొన్ని మాత్రం పాడైపోయి వాటి నుండి దుర్వాసన వెదజల్లడంతో విషయాన్ని ఉపాధ్యాయుల దృష్టికి తీసుకువచ్చారు. ఆ కోడి గుడ్లను వారం రోజుల కిందట ఉన్నత పాఠశాలకు సరఫరా చేసినట్టు తెలుస్తుంది. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడం, దాంతోపాటు వారం రోజులుగా రోజుకి 100 చొప్పున కోడిగుడ్లు ఉడకపెట్టి విద్యార్థులకు ఇస్తుండడంతో పాత గుడ్లు ఎక్కువ రోజులు నిల్వ ఉండిపోయాయి. ఎండలు తీవ్రంగా ఉండడం, ఆపై నిల్వ ఉండడంతో గుడ్లు పాడైపోయి ఉంటాయని నిల్వగా మరికొన్ని కోడిగుడ్లు మిగిలి ఉండడంతో వాటిలో ఎన్ని పాడైపోయి ఉన్నాయో, ఎన్ని బాగున్నాయో అర్థం కాని పరిస్థితి ఎండాకాలంలో పాడైపోయిన కోడిగుడ్ల వల్లే విరోచనాలు, ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. పాఠశాలకు సరఫరా కోడిగుడ్లను ఉపాధ్యాయులు దృష్టి సాదించిన తర్వాతే విద్యార్థులకు పెట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు.

## ఇళ్ల వద్దనే పెన్షన్లు ఇవ్వాలి

**ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు:** లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పెన్షన్లు పంపిణీ చేయాలని టీడీపీ మండల అధ్యక్షులు సన్నారెడ్డి సురేష్ రెడ్డి డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు పొలిట్ బ్యూరో సభ్యులు, సర్వేపల్లి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సూచనల మేరకు బుధవారం టీడీపీ, జనసేన నాయకులు వెంటనే అవ్వా, తాతలకు, వితంతువులకు, వికలాంగులకు, వారి ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు అందించాలని, ఎంపీడీఓ నారాయణ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ బ్యాంకుల్లో ఇంతవరకు పింఛన్ల పంపిణీ నగదు జమ కాలేదని ఇది రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కదా అని ప్రశ్నించారు. పెన్షన్లు పంపిణీ చేసేందుకు ఖజానాలో డబ్బులు లేవని, ఈ విషయాన్ని కప్పిపుచ్చుకునేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిందను టీడీపీపై వేస్తున్నారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ కుట్రలు, కుతంత్రాలు రాష్ట్ర ప్రజలకు తెలుసన్నారు. కార్యక్రమంలో టీడీపీ, బిజెపి ఎం, జనసేన సేన నాయకులు నాసిన శ్రీనివాసులు గౌడ్, శ్రీనాథ్, రవి నాయుడు, రాజేష్, గిరి, హరిబాబు, సీనయ్య ఉన్నారు.

## టిడిపిలో పలువురు చేరిక

**ప్రజాశక్తి-నెల్లూరు సిటీ:** నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలో టిడిపిలోకి రోజురోజుకు వైసీపీ నుంచి వలసలు పెరుగు తున్నాయని అత్యంత భారీ మెజార్టీతో టిడిపి గెలవబోతుందని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు.నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని కొత్తవెల్లంటి గ్రామానికి చెందిన వారు తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి తెలుగుదేశం పార్టీలోకి సాదరంగా ఆహ్వానిం చారు. కార్యక్రమంలో జెన్ని రమణయ్య, బెలూమ్ శ్రీనివాసులు రెడ్డి, బెలూమ్ వెంకటేశ్వర్లు రెడ్డి, నారాయణ, వెంకట సుబ్బయ్య, పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న దృశ్యం

## వాహనాలు తనిఖీ

**ప్రజాశక్తి-నెల్లూరు సిటీ:** సార్వత్రిక ఎన్నికల విధుల్లో భాగంగా నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గం 117 రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్, చెక్ పోస్టు నిర్వహణ బాధ్యతలలో భాగంగా బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. స్థానిక సాలు చింతల ప్రాంతం, వెంకయ్య స్వామి దేవాలయం మార్గంలో నగరంలోకి వస్తున్న ప్రయాణికుల వాహనాలను, వారి బ్యాగులను ఆయన క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున మద్యం, నగదు, మారణాయు ధాలను వాహనాలలో రవాణా చేయడం చట్టరీత్యా నేరం అని ప్రయాణికులకు తెలియజేశారు. అక్రమ మద్యం రవాణా, ఓటర్లకు నగదు పంపిణీ వంటి చర్యలపై తగిన ఆధారాలతో మొబైల్ ద్వారా సి విజిల్ యాప్ సహాయంతో ఫిర్యాదు చేయాలని రిటర్నింగ్ అధికారి ప్రజలకు సూచించారు. ఈ తనిఖీల్లో 3వ నగర పోలీస్ ఎస్ఐ నాగేశ్వరరావు, ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ శివకృష్ణ బృందం పాల్గొన్నారు.